## మాడల్ స్కూల్‌లో దరఖాస్తుల ఆహ్వానం

చేవెళ్ల రూరల్, మే 3 : శంకర్‌పల్లిలోని మాడల్ స్కూల్ (ఆదర్శ పాఠశాల)లో ఇంటర్ మొదటి సంవత్సరం ఆంగ్ల మాధ్యమానికి ఈనెల 5వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.శోభారాణి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 20వరకు గడువు ఉన్నదని, ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని, ప్రతి గ్రూపులో 40 సీట్ల చొప్పున 160 సీట్లు ఉన్నాయని తెలిపారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని, ఎస్ఎస్‌సీలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక చేయటం జరుగుతుందన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను ఈనెల 26న వెబ్‌సైట్‌లో ఉంచుతామని, 27 నుంచి 31వ తేదీ వరకు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని, జూన్ 2వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. అదేవిధంగా ఇంటర్ రెండో సంవత్సరంలో కూడా సీట్లు అందుబాలులో ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## కళాశాల నిర్మాణానికి విరాళం



షాద్‌నగర్, మే3: షాద్‌నగర్ పట్టణంలో దాతల సహకారంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి శనివారం కేసర్ ఇండస్ట్రీ నిర్వాహకుడు బంకట్‌లాల్ బాటీ రూ. 15 లక్షల చెక్కును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు షాద్‌నగర్‌లో అందజేశారు. దాతల సహకారంతో నిర్మిస్తున్న కళాశాలకు ఆర్థిక సాయం అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో నాయకులు కాశీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు కొండల్‌రెడ్డి, ఉపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి అభినందించారు. ప్రతిభచాటిన అఖిల, అస్మా సుల్తానా, ప్రియాంకను సన్మానించారు.

- పెద్దఅంబర్‌పేట, మే 3

## విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి

నందిగామ, మే 3: విద్యుదాఘాతానికి గురై కార్మికుడు మృతి చెందిన ఘటన నందిగామ మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. నందిగామ సీఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం జింకురాల గ్రామానికి చెందిన కిషోర్(21) ఓ కాంట్రాక్టర్ వద్ద ఎలక్ట్రికల్‌గా పని చేస్తున్నాడు. శనివారం నందిగామలోని ఓ వెంచర్ సమీపంలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాకు సంబంధించిన పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి నీలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రసాద్ తెలిపారు.

## నిధులు కేటాయించాలి



పెద్దఅంబర్‌పేట, మే 3: మున్సిపాలిటీ పరిధి రావినారాయణరెడ్డి కాలనీలో అఖిల భారత యువజన సమైక్య జిల్లా అధ్యక్షుడు తైలి మధు ఆధ్వర్యంలో ఏఐవైఎఫ్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీపీఐ నాయకులు రవీంద్రచారి, యాదిరెడ్డి జెండా ఆవిష్కరించారు. యువత క్రమశిక్షణ, దేశభక్తి, సేవాగుణం కలిగి ఉండాలని, కుల మత ఉన్మాదాలకు వ్యతిరేకంగా సమసమాజ నిర్మాణానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. సాంకేతిక నైపుణ్యం, ఉపాధి కల్పన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మాజీ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర్ హరిసింగ్‌నాయక్, నాయకులు శేఖర్, సంజీవ, వీరేశ్, గణేశ్, భాను ప్రసాద్ పాల్గొన్నారు.

## మురుగు సమస్యను పరిష్కరించండి



మున్సిపల్ కమిషనర్ యోగేశ్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

చేవెళ్ల రూరల్, మే 3 : రోడ్లు, మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి సింగాపూర్ వార్డులోని ఆదర్శ్‌నగర్ వెల్ఫేర్ సొసైటీ కాలనీ వాసులు శనివారం శంకర్‌పల్లి పురపాలక సంఘం కార్యాలయంలో కమిషనర్ యోగేశ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలో అస్తవ్యస్తంగా రోడ్లు, మురుగు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడం జరుగుతుందన్నారు. మున్సిపాలిటీ నుంచి రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఆదర్శ్‌నగర్ కాలనీ అధ్యక్షుడు వై.రాంచందర్, ప్రధాన కార్యదర్శి బి.రాములు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఎస్.రవీందర్, ఎం.శ్రీనివాస్, కోశాధికారి బి.నారాయణ, కాలనీ సభ్యుడు బి.మాణిక్యం, కాలనీవాసులు ఉన్నారు.

# అకాల వర్షం.. అపార నష్టం



కడ్తాల్: ఏక్వాయిపల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి



కడ్తాల్: కడ్తాల్‌లో గాలివానకు రాలిన మామిడికాయలు

- వడగండ్ల వానకు తడిసిన ధాన్యం, రాలిన మామిడికాయలు
- దెబ్బ తిన్న పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు



కడ్తాల్: చరికొండలో ఈదురు గాలులకు కూలిన రేకుల షెడ్డు

కడ్తాల్, మే 3: మండల కేంద్రంతోపాటు పరిధిలోని ఏక్వాయిపల్లి, మర్రిపల్లి, చరికొండ గ్రామాల్లో శుక్రవారం రాత్రి అకాల వర్షం కురిసింది. ఈదురు గాలులకు తోడు, వడగండ్ల వాన రైతన్నలకు అపార నష్టం కలిగించింది. ఏక్వాయిపల్లి, మర్రిపల్లి గ్రామాల్లో కురిసిన వడగండ్ల వానకు దాదాపు 80 ఎకరాల్లో వరి పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ ఏవో శ్రీలత తెలిపారు. అదే విధంగా కడ్తాల్ గ్రామంలో పలు తోటల్లో మామిడికాయలు నేలరాలగా, చరికొండ గ్రామంలో ఈదురు గాలులకు ఓ ఇంటి ముందు ఉన్న రేకులు కూలిపోయింది. శనివారం ఉదయం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దెబ్బతిన్న వరి పంటలను వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించాలని సూచించారు. అనంతరం సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. అకాల వర్షానికి రైతులు నష్టపోయారని, ప్రభుత్వ పరంగా ఎకరాకు రూ.40 వేలు అందించాలని కోరారు. దెబ్బతిన్న పంటను పరిశీలించిన వారిలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, ఏఎంసీ చైర్‌పర్సన్ గీతముదిరాజ్, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహాగౌడ్, ఏఈవోలు అభినవ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కష్యబ్, నాయకులు వీరయ్య, శ్రీనుగుప్తా, భిక్షపతి, నర్సింహ, యాదయ్య, బాలయ్య, కృష్ణయ్య, జంగయ్య, సురేశ్ ఉన్నారు.



కేశంపేట : వర్షానికి విరిగి పడిన చెట్లు

**కేశంపేటలో..**

కేశంపేట : మండల పరిధిలోని కోనాయపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి రహదారికి ఇరువైపులా చెట్లు విరిగిపడ్డాయి. దీంతో వాహనదారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చేతికొచ్చిన వరి పంట దెబ్బతిన్నట్లు రైతులు వాపోతున్నారు.

## వేసవిలో మొక్కలను సంరక్షించాలి

యాచారం, మే3: వేసవిలో నర్సరీ మొక్కలను తప్పనిసరిగా సంరక్షించాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఉన్న నర్సరి మొక్కలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీలో పెంచుతున్న మొక్కలకు నిత్యం క్రమం తప్పకుండా నీరందించాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. ప్రతి నర్సరీకి గ్రీన్‌నెట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం కొత్తపల్లి నుంచి నాగిళ్ల రోడ్డును పరిశీలించారు. రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని ఆయన సూచించారు.



కొత్తపల్లిలో మొక్కలు పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

చేవెళ్లటౌన్, మే 3: చేవెళ్ల మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం చేవెళ్ల నియోజకవర్గంలోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలానికి చెందిన 42మందికి, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంరిలీఫ్‌ఫండ్ చెక్కులకు సంబంధించి రూ.42,04,872లను ఎమ్మెల్యే కాలె యాదయ్య పంపిణీ చేశారు. అదే విధంగా 55మందికి మంజూరైన రూ.24,77,500 సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఆయన వెంట చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, ముడిమ్యాల సీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఆగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, రాజశేఖర్, టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్‌లు యాదయ్య, శ్రీనివాస్‌యాదవ్, డైరెక్టర్ జనార్దన్, గుడిమల్కాపూర్ డైరెక్టర్లు పాండుయాదవ్, మోహన్‌రెడ్డి, నాయకులు మహేందర్, రవిందర్‌రెడ్డి ఉన్నారు.

# సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- నైపుణ్యం ఉన్న వారికే ఉపాధి అవకాశాలు
- జేపీ మోర్గాన్ కంపెనీ ఉపాధ్యక్షుడు మారియో డేవిడ్
- కేఎల్‌హెచ్ యూనివర్సిటీలో ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్




మీడియాతో మాట్లాడుతున్న జేపీ మోర్గాన్ కంపెనీ ఉపాధ్యక్షుడు మారియో డేవిడ్

మొయినాబాద్, మే3: మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటూనే విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని జేపీ మోర్గాన్ కంపెనీ ఉపాధ్యక్షుడు మారియో డేవిడ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామ రెవెన్యూలో గల కేఎల్ హైదరాబాద్ యూనివర్సిటీలో శనివారం రాత్రి ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్ కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా నిర్వహించారు. ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్‌లో ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు ఆయా కంపెనీల ప్రతినిధులు ప్రశంసాపత్రాలను, మెడల్స్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక రంగంలో ఎప్పటికప్పుడు వస్తున్న విప్లవాత్మక మార్పులను పసిగడుతూ సంపూర్ణ నైపుణ్యాన్ని పెంచుకుంటే మెరుగైన ఉపాధి అవకాశాలు రావడానికి అవకాశం ఉంటుందన్నారు. సాంకేతిక నైపుణ్యాన్ని పెంచుకుంటే విద్యార్థులకు ఉజ్వల భవిషత్ ఉంటుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధిలో అనేక సవాళ్లు ఎదురవుతాయని వాటిపై నిరంతరం పరిశోధనలు చేస్తూ సవాళ్లను అధిగమించడం జరుగుతుందని తెలిపారు. అంతర్జాతీయ కార్పొరేట్ కంపెనీలు తమ పరిధిని విస్తరిస్తున్నాయని . భవిషత్ కోసం ఇంజినీరింగ్ విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లే విద్యార్థులకు ఎప్పుడూ ప్రాధాన్యత ఉంటుందన్నారు.

**పారిశ్రామిక అనుబంధ శిక్షణలు : డైరెక్టర్ ఆకెళ్ల రామకృష్ణ**

కేఎల్ హెచ్ యూనివర్సిటీలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు పారిశ్రామిక అనుబంధ శిక్షణలు ఇచ్చి వారిని ఎంతో నైపుణ్యం గల విద్యార్థులుగా తయారు చేసి వారికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేస్తున్నామని కేఎల్‌హెచ్ యూనివర్సిటీ డైరెక్టర్ ఆకెళ్ల రామకృష్ణ అన్నారు. విద్యార్థుల్లో అనేక రకాలైన నైపుణ్యాలను పెంచడంలో యూనివర్సిటీ ఎంతో కృషి చేస్తుందని చెప్పారు. విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో సాధించిన విజయాలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపేలా విజయోత్సవాన్ని ఘనంగా నిర్వహించామని తెలిపారు. కేఎల్ విద్యా సంస్థలో చదివే ప్రతి ఒక్క విద్యార్థికి క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రెయినింగ్ ప్రోగ్రాం కింద ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని , తద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందిస్తూ వారిని అత్యుత్తమ ప్యాకేజీలు పొందేలా ప్రణాళిక అమలు చేస్తున్నామని తెలిపారు.

## వేతనాలను వెంటనే చెల్లించాలి

### ఆర్డీవోకు వినతి పత్రం అందజేత




ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న కార్మిక సంఘం జిల్లా నాయకులు

షాద్‌నగర్‌రూరల్, మే 3: ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఆర్డీవో సరితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జగన్, ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్ మాట్లాడుతూ.. కూలీలకు రోజువారి హాజరు, కొలతల వివరాలు సేకరించే ఫీల్డ్ అసిస్టెంట్‌లకు నాలుగు నెలలుగా వేతనాలను చెల్లించకపోవడంతో వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వారు తెలిపారు. అదేవిధంగా ఫీల్డ్ అసిస్టెంట్‌లకు కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలని, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత, ప్రమోషన్లు కల్పించాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతామని వారు తెలిపారు. కార్యక్రమలలో సంఘం నాయకులు రత్నం, యాదయ్య, కృష్ణయ్య, శ్రీనివాస్, శంకర్, కిష్టయ్య పాల్గొన్నారు.

**ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలను చెల్లించండి**

షాద్‌నగర్ : ఉపాధి హామీ పథకం ద్వారా క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రతి నెలా వేతనాలను చెల్లించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నాయకులు, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం షాద్‌నగర్ ఆర్డీవో కార్యాలయం సూపరింటెండెంట్ జ్యోతికి వినతిపత్రం అందజేసిన అనంతరం మాట్లాడారు. నాలుగు నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జగన్, శ్రీనునాయక్, రత్నం, యాదయ్య, కృష్ణయ్య, శంకర్, కిష్టయ్యలు పాల్గొన్నారు.



## మండల పరిషత్ కార్యాలయానికి తాళం

కొందుర్గు, మే 3: కొన్నాళ్లుగా అద్దె ఇవ్వడం లేదని చౌదరిగూడ మండల పరిషత్ కార్యాలయానికి శనివారం తాళం వేశారు. వివరాల్లోకి వెళితే.. చౌదరిగూడ గ్రామంలో కోనేరి శ్రీనివాస్ ఇంటిని ప్రభుత్వం మండల పరిషత్ కార్యాలయం ఏర్పాటుకోసం ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే గత కొన్నాళ్లుగా అద్దె చెల్లించకపోవడంతో కోనేరి శ్రీనివాస్ ఇంటికి తాళం వేసి అధికారులను నిలిపివేశాడు. అద్దె చెల్లించే వరకు తాళం తీసేది లేదని భీష్మించి కూర్చున్నాడు. ఉన్నతాధికారులతో మాట్లాడి అద్దె చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

## విద్యార్థులకు ఘన సన్మానం

మాడ్గుల, మే3: మండల పరిధిలోని ఇర్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో మండల స్థాయిలో ప్రథమ స్థానం వచ్చారు. 100 శాతం ఉత్తీర్ణులయ్యారు. 600 మార్కులకు గారు 15 మంది విద్యార్థులు టాప్ ర్యాంకుల్లో నిలిశారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాల్లో చదిన విద్యార్థులను పది ఫలితాల్లో ర్యాంకులు వచ్చిన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. అందులో ఇర్విన్ పాఠశాల విద్యార్థులను శనివారం జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి విద్యార్థులను ఘనంగా సన్మానించారు. వారిని అభినందించారు. ఇర్విన్ పాఠశాల సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలోని ఎంఈవో సర్దార్ నాయక్, హెచ్ఎం పార్వతాలు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు



- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ

ఆమనగల్లు, మే 3: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందజేస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో శనివారం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మున్సిపాలిటీ, మండల పరిధిలోని 49 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు, ఇందిరమ్మఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకాలను అందజేస్తామన్నారు. నియోజకవర్గానికి 3500 ఇందిర్మ ఇండ్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఇందిరమ్మ రైతు భరోసా పథకం కింద డబ్బులు రానివారికి జూన్ లోగా వారి ఖాతాలో జమ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. రాజీవ్‌యువ వికాసం పథకానికి ఆమనగల్లు మున్సిపాలిటీలో 520 మంది, మండలంలోని 13 గ్రామపంచాయతీల నుంచి 675 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అర్హులైన అందరికీ రూ.5 లక్షలలోపు సాయం అందజేయడం జరుగుతుందన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలకు పంట నష్టపరిహారం అందజేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ లలిత, ఎంపీడీవో మాధురి, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మండల, పట్టణ అధ్యక్షుడు జగన్, మానయ్య, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కేశవులు, మాజీ సర్పంచ్ సత్యం, కేఎస్ఆర్ సేవాదళం అధ్యక్షుడు బాబా, నాయకులు కృష్ణానాయక్, విజయ్‌నాయక్, మైసయ్య, శ్రీను, కరీం, మల్లయ్య, శివలింగం, శ్రీనివాస్‌రెడ్డి, అలీం, ఫరీద్, విజయ్‌రాథోడ్, కండె సాయి, మహేశ్, శ్రీనునాయక్, నాజర్, ఆర్ఐలు చెన్నకేశవులు, సంపత్ ఉన్నారు.

## సార్వత్రిక సమ్మె నోటీసు అందజేత



ఎంఈవో చంద్రశేఖర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నేతలు, మధ్యాహ్న భోజన కార్మికులు

కేశంపేట, మే 3: దేశవ్యాప్తంగా ఈ నెల 20న నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మె నోటీసును మండల విద్యాధికారి చంద్రశేఖర్‌కు సీఐటీయూ మండల కన్వీనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్న భోజన కార్మికులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. అదేవిధంగా కేశంపేట మండల కేంద్రం నుంచి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నేతలు రంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయానికి తరలివెల్లి ఏవో సుధాకర్‌కు సమ్మె నోటీసును అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు అక్కమ్మ, వెంకటమ్మ, జంగమ్మ, సునీత, జంగమ్మ, శ్యామల, ఏఐటీయూసీ జిల్లా నాయకులు రాంచంద్రయ్య, టి.నర్సింహారెడ్డి, రవి, యాదమ్మ, భిక్షమయ్య, రామస్వామి, మల్లయ్య ఉన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



ఉప్పరపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ, మే 3: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక కార్పొరేటర్ అర్చన జయప్రకాష్‌తో కలిసి రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని శివరాంపల్లి ఉప్పరపల్లి తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీధర్ రెడ్డి, శంకర్, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

***కోటి 30 లక్షలు మంజూరు***

ప్రజల సహకారంతో అభివృద్ధి పనులలో దూసుకుపోతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శివ సాయి నగర్, తిరుమల హిల్స్ కాలనీవాసులు ఎమ్మెల్యేను కలిసి సమస్యలను వివరించారు. ఈ మేరకు ఆయన మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఆయా కాలనీల అభివృద్ధికి కోటి 30 లక్షల పనులను మంజూరు చేస్తూ ఆ కాపీని కాలనీవాసులకు అందజేశారు. కార్యక్రమంలో పూలపల్లి కృష్ణారెడ్డి, భోగాల శ్రీనివాస్, ప్రేమ్ కుమార్, సురేశ్ గౌడ్, రాంప్రసాద్, హరీశ్ గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు ప్రారంభం



మణికొండ, మే 3: మణికొండ మర్రిచెట్టు బస్‌స్టాప్ వద్ద టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ మాజీ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు. మణికొండ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మీ పార్శళ్లను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాలకు బుకింగ్ చేసుకొని పంపించుకోవాలన్నారు. ప్రజల సౌకర్యం కోసం ఆర్టీసీ ఈ సేవలను ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమలో ఆర్టీసీ అధికారులు ఏటీ ఎం పాల్, డీఎంఈ రమేష్, ఏజెంట్ రమేష్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి, రాఘవరెడ్డి, ఆనంద్‌రావు, రాజేష్, ముత్యాలు, శ్రీనివాస్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, రాములు పాల్గొన్నారు.